మా ఉసురు తగులుతుంది బాబూ

ఇన్నాళ్లూ ఒకటో తేదీనే ఇంటికొచ్చి వలంటీర్లు పింఛన్లు ఇచ్చి వెళ్లేవాళ్లు. ఈనెల నుంచి వలంటీర్లు ఇచ్చే దానికి వీల్లేదంట. చంద్రబాబే దీనికి కారణమని చెబుతున్నారు. ఆయన సీఎంగా ఉన్నప్పుడు పింఛన్ల కోసం ఎన్ని బాధలు పడినామో!..జగను వచ్చినాక ఆ బాధలన్నీ తీర్చినాడు. వలంటీర్లు ఇంటికే వచ్చి పింఛన్లు ఇస్తాంటే చంద్రబాబుకు ఎందుకో ఇంత కడుపుమంట? ఆయనకు మా ఉసురు తగులుతుంది అనియోజకవర్గంలోని పలువురు వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, మంచానికే పరిమితమైన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు శాపనార్థాలు పెడుతున్నారు.

-పలమనేరు

- నిరసన వ్యక్తం చేస్తున్న సామాజిక పింఛనుదారులు
- వలంటీర్ల సేవలకు స్వస్తి పలికించారని సర్వత్రా ఆగ్రహం

శాపనార్థాలతో వెనుదిరిగిన పింఛనుదారులు

గుడుపల్లె: రోజంతా పడికాపులు కాసినా పింఛన్లు ఇవ్వక పోవడంతో పండుటాకులు శాపనార్థాలు పెడుతూ వెనుదిరిగిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. మండలంలో వివిధ సామాజిక పింఛనుదారులు 4,870 మంది ఉన్నారు. ఎన్నికల సంఘం తాజా ఉత్తర్వుల నేపథ్యంలో ఆయా గ్రామాలలోని సచివాలయాల వద్ద తీసుకోవాలని పింఛన్లు పొందాలని అధికారులు చెప్పడంతో ఇబ్బందులకోర్చి సచివాలయాలకు వచ్చినా ఇవ్వలేదని మండిపడ్డారు. చూసించారు. తమకు ఇళ్ల వద్దనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై మండల పరిషత్ కార్యాలయంలోని ఓ అధికారిని 'సాక్షి' సంప్రదించగా.. రెండు మాడు రోజులు గడచిన తరువాత ఆయా గ్రామాలలోని సచివాలయల వద్ద పింఛన్లు ఇవ్వనున్నట్లు చెప్పారు.



బాధ పెడితే రెండింతలు అనుభవిస్తారు

మోకాళ్ల నొప్పులతో ఎక్కడికీ వెళ్లలేను, నడవలేను. జగన్ బాబు పుణ్యాన ఇంటి కాడే పింఛన్ తీసుకుంటున్నా. ఇప్పుడు వలంటీర్లను పింఛన్లకు దూరం పెట్టడం అంటే మాకు కష్టాలు తెప్పిచ్చినట్టే. టీడీపీ హయాంలో ఎన్నో బాధలు పడినా. నడవలేని నేను పింఛను కోసం సచివాలయం కాడికి వెళ్లమంటే ఎట్లపోయేది నేను? ఇట్లా బాధపెడితే అంతకు రెండింతలు అనుభవిస్తారు. –మనోర్మమ్మ, బైరెడ్డిపల్లె



మళ్లీ టీడీపీ కాలం కష్టాలు తప్పవేమో!



చంద్రబాబు హయాంలో పింఛన్ల కోసం పోస్టాఫీసుకెళ్లి రోజంతా పడిగాపులు కాసే వాళ్లం. ఎన్నో ఇబ్బందులు పడి తేగానీ చేతికి పింఛను అందేది. టవర్ సిగ్నల్ రాకపోతే ఇక అంతే సంగతులు. కానీ జగను వచ్చినా ఏ బాధా లేదయ్యా. వలంటీర్లే ఇంటికాడికొచ్చి పింఛన్లు ఇచ్చేవాళ్లు. అది నిలిపిచ్చినారు. ఇప్పుడు మళ్లీ టీడీపీ కాలం నాటి బాధలు తప్పవేమో?


–దస్తగిరిసాబ్, ఎస్వీజీ స్ట్రీట్, వీ.కోట

ఆ దేవుడు కూడా క్షమించడు



ఇంటి వద్దకొచ్చి పింఛను డబ్బు ఇచ్చే వలంటీర్లను తీపిచ్చేశారు. ఇప్పుడు ఎక్కడ పింఛని స్తారో కూడా తెలీదు. మాలాంటోళ్లను కష్ట పెట్టేవాళ్లకు మంచి జరగదు. ఎలక్షన్ టైంలో ఈ పనికిమాలిన రాజకీయాలేందో నాయనా! మేమిక మళ్లీ ఎన్ని బాధలు పడాలో? ఆ దేవుడు కూడా వీళ్లను క్షమించడు –సరోజమ్మ, బ్రాహ్మణవీధి, వీకోట

పురుగులు పట్టి'పోతారు'



చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు పింఛన్ల కోసం చానా బాధలు పడినాం. ఆ పరిస్థితి లేకుండా వలంటీర్లు ఎంతో మేలు చేసినారు. ఆ డబ్బులు ఆసుపత్రికి, ఖర్చులకు వాడుకునేదాన్ని. పొద్దున్నుంచీ పింఛను కోసం ఎదురుచూస్తాంటే..తెలుగుదేశం వాళ్లు వలంటీర్లు పింఛన్లు ఇవ్వనీకుండా చేసినారని చెప్తాండారు. మమ్మల్ని బాధ పెడితే పురుగులు పట్టిపోతారు. – నూర్‌జాన్, బైరెడ్డిపల్లె

బాబుకు ఎందుకో ఇంత కడుపు మంట?



పింఛను కోసం టీడీపీ హయాంలో చాలా కష్టాలు పడ్డాం. ఆఫీసుల కాడ గంటలు..గంటలు పడిగాపులు కాసినా అందేది కాదు.. అయితే జగను ప్రభుత్వం వచ్చినాక మా కష్టాలు తీరినాయి. ఒకటో తేదీ తెల్లారకముందే వలంటీర్లు ఇంటికాడికొచ్చి పింఛన్లు ఇచ్చేవాళ్లు. వాలంటీర్లంటే చంద్రబాబుకు ఎందుకో ఇంత కడుపుమంట? వాళ్లు పింఛన్లు ఇచ్చేదానికి వీల్లేదని చేపిచ్చినాడని చెప్తాండారు. ఆయనకు మాలాంటి పింఛనోళ్ల ఉసురు తగులుతుంది నాయనా! – సాలమ్మ, ఎర్రమ్మచెరువు ఎస్టీకాలనీ, పెద్దపంజాణి

వీళ్ల పాపాలకు లెక్క చెప్పే రోజొస్తుంది



నెల నెలా ఒకటో తేదీ పొద్దుపుట్టక ముందే పింఛన్ వచ్చేదయ్యా. వాలంటరీ పిల్లోడు నేరుగా ఇంటికాడికే వచ్చి పింఛను ఇచ్చేవాడు. నాకు 75 ఏళ్లు సామీ. కాల్లు సచ్చుబడి సరిగా నడవలేను. జగను రాక ముందు తెల్గుదేశంలో పింఛను తీస్కోనేదానికి చానా ఇబ్బందులు పడినా. ఆ తర్వాత జగను దయతో తెల్లారకముందే ఇంటికాడికే వచ్చి పింఛన్లు ఇస్తాంట్రి. ఇప్పుడేమో ఆ పిల్లాడు నాకు పింఛను ఇచ్చేకి రాలా. పింఛను కోసం తెల్లర్నుంటి ఇంటికాడే కాస్కోనుండా. మజ్జానమైనా రాలా.. మళ్లీ అప్పట్లాగ (చంద్రబాబు హయాం) ఆఫీసుల కాడికిబోయి పింఛను తీస్కోవాలంట కదా.. అట్లని ఆఫీసులో సారోల్లు చెప్పినారంట. ఏంది సామీ నాకు ఈ బాధలు. మళ్లా అరికాళ్లు కాయలు కాయల్నేమో!? జగను ప్రభుత్వం వచ్చి మా కష్టాలు తీరిస్తే.. చంద్రబాబు ఎలచ్చను వచ్చిందని వాలంటీర్లు పింఛను దుడ్లు పంచగూడదని చెప్పినారంట. వీళ్ల నోట్లో మన్ను పడా.. వీళ్ల పాపాలకు లెక్క చెప్పే రోజొకటి వస్తాది లే. పైవాడు అన్నీ చూస్తాంటాడు. మళ్లీ జగను వచ్చి మమ్మల్ని చల్లగా చూస్తాడు. –ఇంద్రావతమ్మ, చిన్నూరు, గంగవరం మండలం

ఇక తలుపు తట్టి పింఛను ఇచ్చేవాళ్లు ఉండరా?



ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా ఒకటో తేదీ వలంటీర్లు వచ్చి తలుపు తట్టి పింఛన్లు ఇచ్చేవాళ్లు. చంద్రబాబుకు తొలినుంచీ వలంటీర్లంటే కడుపు మంట. మా ఉసురు తగలకమానదు. వలంటీర్లను పింఛన్లు ఇవ్వకుండా చేయడం చాలా బాధాకరం.

–మునిలక్ష్మమ్మ, తీర్థం, బైరెడ్డిపల్లె

ఇది దారుణం



ఐదేళ్లుగా ఒకటో తేదీ ఠంచనుగా పింఛను అందేది. ఏ కష్టం లేకుండా వలంటీర్లు ఇంటి వద్దే ఇస్తూ ఎంతో మేలు చేసేవాళ్లు. ఇప్పుడు వలంటీర్ల మీద కక్ష కట్టి చంద్రబాబు పింఛన్లు అందనీకుండా చేస్తున్నాడు. ఈ వయస్సులో మళ్లీ ఆఫీసుల కాడికిబోయి పింఛను తీస్కోవాలంటే ఎంత కష్టమో మాకు. భగవంతుడు ఇట్లాంటిటోళ్లను క్షమించడు.

–లక్ష్మీదేవమ్మ, తీర్థం, బైరెడ్డిపల్లె

విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

సదుం: మండలంలోని పాపిరెడ్డిగారిపల్లెలో నూతన యల్లమ్మ ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గ్రామోత్సవం, గణపతిపూజ, పుణ్యాహవచనం, వాస్తుపూజ, వాస్తుహోమం, దీక్షాధారణ, తీర్థ ప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏపీఎం క్రిష్ణప్ప

పెద్దపంజాణి: రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని వెలుగు ఏపీఎం క్రిష్ణప్ప కోరారు. సోమవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో సంఘమిత్రలు, సీసీలకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఆయుధం ఓటు అని, దీనిని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని, అలాగే 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు. అనంతరం మానవ హారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీసీలు వసంత, శ్రీనివాసులు, చిన్నా, సుగుణ పాల్గొన్నారు.

'సప్తగిరి'లో తక్కువ వడ్డీకే రుణాలు



ఆటో ప్రచారంతో అవగాహన కల్పిస్తున్న మేనేజర్

చౌడేపల్లె: సప్తగిరి గ్రామీణ బ్యాంకు చౌడేపల్లె శాఖలో తక్కువ వడ్డీకే పంటరుణాలు, బంగారు తాకట్టుపై రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఆ శాఖ మేనేజర్ ఏడుకొండలు తెలిపారు. సప్తగిరి బ్యాంకు రుణాలపై సోమవారం గ్రామాల్లో ప్రచారం చేశారు. మేనేజర్ మాట్లాడుతూ, ఎస్సీ, బీసీలకు దీనబంధు పథకం కింద బంగారుపై తాకట్టు రుణాలు 66 పైసలకే మంజూరు చేస్తున్నామని చెప్పారు. పంట, గృహరుణాలు, వాహనాల కొనుగోలుపై రుణాలు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. సీనియర్ సిటిజన్లకు బ్యాంకు ఎఫ్‌డీలపై అత్యధికంగా 8.25శాతం వడ్డీ ఇస్తున్నామన్నారు. నెట్ బ్యాంకింగ్, డిజిటల్ లావాదేవీలతోపాటు ఏటీఎం సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. మండల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంకు సిబ్బంది సత్యదేవ్, ప్రవీణ్, వంశీ, రవి, హరీష్, రమణ పాల్గొన్నారు.

నేటి నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

సదుం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో మండలంలో రెండు రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని ఎస్ఐ మారుతి తెలిపారు. అమ్మగారిపల్లె వద్ద సీఎం బస చేయనుండడంతో మంగళవారం సాయంత్రం 6 నుంచి 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు ఆంక్షలు విధిస్తున్నామని, వాహనాలను బూరగమంద, చీకలచేను, నంజంపేట, సోమల మీదుగా మళ్లిస్తున్నట్లు చెప్పారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

కుప్పం రూరల్: కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో పాలిసెట్-2024కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 2 నుంచి 26వ తేదీ వరకు ఈ శిక్షణ ఇస్తామని, 10వ తరగతి పరీక్షలు రాసి, పాలిటెక్నిక్ కోర్సులపై ఆసక్తి ఉన్న అభ్యర్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ ఇస్తామని, అలాగే బస్సు సౌకర్యం కల్పించినట్లు చెప్పారు

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే

గంగవరం: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మండలంలోని గండ్రాజుపల్లె పంచాయతీ పెద్దఉగిణిలో ముస్లింలు సోమవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరయ్యారు. ముస్లింలను ఆలింగనం చేసుకుని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తార్ విందులో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో పాటు రాష్ట్ర ప్రజలందరికీ అల్లాహ్ కరుణాకటాక్షాలు మెండుగా లభించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరమణ, వైస్ ఎంపీపీ ఆదాంబాషా, పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప, చలపతిరెడ్డి, రాధాక్రిష్ణ, కిషోర్, దాదుల్లా పాల్గొన్నారు.



ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

36 మంది వలంటీర్లు రాజీనామా

రొంపిచెర్ల: రాష్ట్రంలో టీడీపీ నాయకులు పెడుతున్న కేసులు, ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేయడం, వేధింపులకు నిరసనగా రొంపిచెర్ల గ్రామ పంచాయతీలో 25 మంది సచివాలయ వలంటీర్లు తమ పోస్టులకు సోమవారం రాజీనామా చేశారు. ఆ పత్రాలను ఎంపీడీఓ రెడ్డెప్పచ్చారికి అందజేశారు. వారు మాట్లాడుతూ, నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదల దరికి చేర్చడంతో కీలకంగా పని చేస్తున్నామని, అయితే వలంటీర్లు దేశద్రోహులుగా టీడీపీ నాయకులు ముద్ర వేసి, ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి, వృద్ధులకు పెన్షన్లును ఇవ్వకుండా తమ సేవలను దూరం చేశారని విమర్శించారు. సంక్షేమ పథకాలను అడ్డుకుంటున్న టీడీపీ ఆడుతున్న డ్రామాలను ప్రజలకు వివరించి వైఎస్సార్‌సీపీ తరఫున ఎన్నికల ప్రచారం చేస్తామని తెలియజేశారు.



రొంపిచెర్ల: రాజీనామా పత్రాలను ఎంపీడీఓకు అందజేస్తున్న వలంటీర్లు

పులిచెర్ల మండలంలో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని దిగువపోకలవారిపల్లె సచివాలయ పరిధిలోని అయ్యావాండ్లపల్లె, దిగువపోకలవారిపల్లె పంచాయతీలలో పది మంది వలంటీర్లు , అలాగే 106 రామిరెడ్డిగారిపల్లెలో ఒకరు తమ పోస్టులకు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. తాము పార్టీలకతీతంగా గ్రామాల్లో సేవ చేస్తున్నా ప్రతిపక్ష పార్టీ చంద్రబాబు అండ్‌కో నిందలు మోపడం, ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో మనస్తాపానికి గురై రాజీనామా చేసినట్టు చెప్పారు. ఇకపై తాము ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా ఉంటూ, ఆ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.



పులిచెర్ల: దిగువపోకలవారిపల్లెలో రాజీనామా చేసిన వలంటీర్లు

సీఎం పర్యటన విజయవంతం చేద్దాం

సదుం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను మండలంలో విజయవంతం చేయాలని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి కోరారు. సోమవారం ఆయన సదుంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. 2వ తేదీ రాత్రి సీఎం బస్సుయాత్ర మండలానికి చేరుకోనున్నట్లు ఆయన చెప్పారు. 3న ఉదయం సీఎం రోడ్ షో నిర్వహిస్తారని, పెద్ద సంఖ్యలో ఘన స్వాగతం పలకాలని, అలాగే మదనపల్లెలో నిర్వహించనున్న బహిరంగ సమావేశానికి హాజరు కావాలన్నారు. వైస్ ఎంపీపీ ధనుంజయ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ తిమ్మారెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, బోయకొండ ఆలయ కమిటీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి, యూత్ మండల కన్వీనర్ వినోద్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

'మేమంతా సిద్ధం'విజయవంతం చేద్దాం

పెద్దపంజాణి: ఏప్రిల్ 3న పూతలపట్టు మండలంలో నిర్వహించనున్న మేమంతా సిద్ధం సభకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఎంపీపీ రెడ్డెప్ప, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగా రెడ్డి కోరారు. సోమవారం పెద్దపంజాణిలో వారు విలేకరులతో మాట్లాడారు. వైస్ ఎంపీపీ జీడీ బాబు, జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ఇంటింటా ప్రచారం



రొంపిచెర్ల: రామచంద్రాపురంలో..



రొంపిచెర్ల: సర్వర్‌పేటలో..



కుప్పం: ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధీర్

రొంపిచెర్ల: రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎన్నికలలో ప్రజలు గెలిపించాలని మండలంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు సోమవారం ఇంటింటా కరపత్ర ప్రచారం చేశారు. గ్రామాభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని, దీనిని దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్ సీపీని ఆదరించాలని ఓటర్లను కోరారు. పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి స్వగ్రామం బొమ్మయ్యగారిపల్లెలో వైఎస్సార్‌సీపీ ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్, పార్టీ నాయకులు డాక్టర్ శ్రీనాథ్, కోటా వెంకటరమణ, కుమార్, విజయ భాస్కర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, మల్లికార్జున రెడ్డి, అలీంఖాన్, సైపుల్లాఖాన్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

భరత్ గెలుపు కోసం..

రామకుప్పం: వైఎస్సార్ సీపీ కుప్పం ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ భరత్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు సోమవారం మండలంలోని ఉన్సిగానిపల్లె, బందార్లపల్లె పంచాయతీలో జోరుగా కరపత్ర ప్రచారం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. కుప్పం నియోజక వర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ కుప్పం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న భరత్‌ను ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. సర్పంచులు నేత్రావతి, రాజ్‌గోపాల్, ఎంపీటీసీ సభ్యులు సులోచన, సౌమ్య, సుధారాణి, రెస్కో డైరెక్టర్ నాగిరెడ్డి, పార్టీ మండల ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, నేతలు మురుగేష్, కుందనందనరెడ్డి, గుర్రప్ప, వార్డు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రామకుప్పం : ఎన్నికల ప్రచారం చేస్తున్న నేతలు

కుప్పంలో..

కుప్పం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ స్థానిక మున్సిపాలిటీల్లోని 17వ వార్డులో కరపత్ర ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా భరత్, ఎంపీగా రెడ్డెప్పను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సర్దార్, నందకుమార్, చిత్తూరు రవి, నాను తదితరులు పాల్గొన్నారు